క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

శాంతిపురం: స్థానిక 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో లేన్ల నిర్వహణ, మరమ్మతు పనులను ఆదివారం చేస్తున్నట్టు కుప్పం రెస్కో డివిజినల్ ఇంజినీర్ హిమ్మత్‌సాగర్ తెలిపారు. దీని కారణంగా శాంతిపురం సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని ఫీడర్లలో నేడు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. అంతరాయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పిల్లలను పనుల్లో పెట్టుకుంటే జైలు ఖాయం

• సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు


ర్యాలీ నిర్వహిస్తున్న మండల అధికారులు

పలమనేరు: పిల్లలను పనుల్లో పెట్టుకుంటే యజమానులు జైలుకెళ్లడం ఖాయమని పలమనేరు సబ్‌కోర్టు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆదేశాలతో పట్టణంలోని పలుచోట్ల హోటళ్లు, మెకానిక్, వెల్డింగ్ దుకాణాల్లో శనివారం మండల న్యాయసేవా అధికార సంస్థ, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు తనిఖీలు చేశారు. దీనిపై దుకాణదారులకు అవగాహన కల్పించేలా ర్యాలీ నిర్వహించారు. బాలకార్మికులను పనుల్లో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని జడ్జి తెలిపారు. బడి ఈడు పిల్లలను తల్లిదండ్రులు విధిగా బడికి పంపాలని సూచించారు. మైనర్లతో వెట్టి చాకిరీ చేయించడం మంచిది కాదన్నారు. ఇందులో సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

వి.కోట: మండలంలోని చింతమాకులపల్లిలో నేడు ఆదివారం కుప్పం బీఆర్‌డీ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు చింతమాకులపల్లి ఎంపీపీ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మండల వాసులు సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరారు.

అశ్వియకు నివాళి


అశ్వియ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

పుంగనూరు: పట్టణంలోని అశ్వియఅంజుమ్ హత్యకు గురికావడంతో జనసేన నేతలు నివాళులర్పించారు. శనివారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిన్నరాయల్, లీగల్‌సెల్ ఇన్‌చార్జ్ సివి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో బాలిక చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో నేతలు శ్రీనివాసులు, అరుణ, పవన్‌కుమార్, రామకృష్ణ, మునీర్, ప్రసాద్, విజయకుమార్, ప్రభు, చంద్రయ్య, అమరనాథ్, పెద్దరాయుడు, మోహన్, రూపేష్, పవన్ పాల్గొన్నారు.

కుంకీలతో సమస్య తీరేనా?

- గజదాడులతో అటవీ ప్రాంత గ్రామాలు గజగజ
- తరచూ పంట పొలాలపై ఏనుగుల దాడులు
- సోలార్ ఫెన్సింగ్, ట్రెంచులతో తీరని పరిష్కారం
- ఏనుగుల దాడులతో పలువురు రైతులు మృతి


పలమనేరు ప్రాంతంలో ఏనుగుల గుంపు(ఫైల్)


ఏనుగుల దాడిలో మృతిచెందిన చిన్నబ్బ(ఫైల్)


బైరెడ్డిపల్లె మండలంలో మృత్యువాత పడిన ఏనుగు (ఫైల్)

పలమనేరు: పలమనేరు, కుప్పం నియోజకవర్గాల పరిధిలో దశాబ్దాలుగా గజరాజుల దాడులతో రైతుల పంటలకు నష్టం జరుగుతూనే ఉంది. పంట పొలాల వైపునకు ఏనుగులు రాకుండా అటవీశాఖ సోలార్ ఫెన్సింగ్ నిర్మించినా, ఎలిఫెంట్ ట్రెంచ్‌లు తవ్వించినా లాభం లేకుండాపోతోంది. ఏటా వేలాది ఎకరాల్లో వీటి కారణంగా పంట నష్టం వాటిల్లుతూనే ఉంది. ఇక ఏనుగులతో రైతుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. కంచె దాటి బయటకొచ్చే ఏనుగులు సైతం మృత్యువాత పడుతున్నాయి. ఈ ప్రాంతంలో ఎంత కట్టుదిట్టం చేసినా తమిళనాడు, కర్ణాటకల నుంచి ఏనుగులు ఈ ప్రాంతంలోకొచ్చి భారీగా నష్టాలు చేస్తూనే ఉన్నాయి. సాక్ష్యాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించే కుప్పం, పొరుగునే ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి ఉన్న పలమనేరు నియోజకవర్గాల్లో పంటలపైకి, పల్లెల్లోకి ఏ క్షణాన ఏనుగులు వస్తాయోనని అటవీప్రాంత గ్రామాలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారు.

నెరవేరని ప్రభుత్వ లక్ష్యం..

పంటలను ధ్వంసం చేసే ఏనుగు గుంపులను కట్టడి చేయాలనే ఉద్దేశంతో 1984లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కౌండిన్య ఎలిఫెంట్ శాంక్చురీతో పూర్తిస్థాయిలో ప్రయోజనం లేకుండా పోతోంది. లక్షలాది రూపాయల వ్యయంతో ఇక్కడ ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్ నిర్వహణ కొండెక్కింది. ఆపై గత టీడీపీ పాలనలో ఇక్కడ ఏనుగులు అడవిలోంచి రాకుండా తవ్విన ఎలిఫెంట్ ట్రెంచ్‌లు ఉపయోగం లేకుండా పోయాయి. దేనినైతే నివారించాలని గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రవేశపెట్టిందో అది కాస్త ఇప్పటిదాకా సాధ్యం కాకపోతోంది.

అసలు సమస్య ఇదీ..

పలమనేరు, కుప్పం పరిధిల్లోని కౌండిన్య అభయారణ్యం 250 కి.మీ మేర వ్యాపించి ఉంది. ఇందులో 110 ఏనుగులున్నట్లు అటవీశాఖ చెబుతోంది. ఇవి పలమనేరు కౌండిన్యలో మూడు గుంపులుగా, కుప్పం ప్రాంతంలో రెండు గుంపులుగా విడిపోయి అటవీప్రాంతంలో సంచరిస్తున్నాయి. అడవిని దాటి ఏనుగులు బయటకు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం బంగారుపాళ్యం మండలం నుంచి కుప్పం వరకు 264 కి.మీ మేర సోలార్ ఫెన్సింగ్‌ను రెండు దఫాలుగా జరిగాయి. అయితే పలుచోట్ల ఫెన్సింగ్ ఇప్పటికే దెబ్బతింది. అడవిలోంచి బయటకొచ్చే ఏనుగులు ఫెన్సింగ్‌కు ఏర్పాటు చేసిన రాతి స్తంభాలను ధ్వంసం చేసి పంటపొలాల వైపు వస్తున్నాయి. వేసవిలో వీటికి మేత, నీటి సౌకర్యం లేకపోవడం ప్రధాన కారణంగా తెలుస్తోంది. సోలార్ ఫెన్సింగ్‌కు ప్రత్యామ్నాయంగా టీడీపీ ప్రభుత్వం ఎలిఫెంట్ ట్రెంచ్ పనులను చేపట్టారు. పైనుంచి మూడు మీటర్లలోతు రెండు మీటర్ల వెడల్పుతో వీటిని తవ్వారు. అయితే ఏనుగులు వీటిని పూడ్చివేసి ఇబ్బంది లేకుండా బయటకు రావడం మొదలు పెట్టాయి.

ఏనుగులు, మనుషుల ప్రాణాలు పోతూనే ఉన్నాయి...

గజదాడులతో గత పదేళ్లుగా 15మంది మృతిచెందగా, 16మంది గాయపడ్డారు. ఇక కరెంట్‌షాక్‌లు, రైతులు పంటలకు పెట్టిన కరెంట్ తీగలు, బావుల్లో పడి, ఏనుగులు పరస్పరం ఘర్షణ పడడం కారణంగా ఇప్పటిదాకా 20 ఏనుగులు మృతిచెందాయి.

కుంకీ ఏనుగుల రాకతోనైనా సమస్య తీరేనా..?

ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇక్కడి ఏనుగుల సమస్య పరిష్కారం కోసం కర్ణాటక నుంచి రెండు కుంకీ ఏనుగులు (శిక్షణ పొందినవి) తెప్పించి వీటి ద్వారా ఇక్కడి ఏనుగులను అదుపులోకి తీసుకొచ్చేలా భావిస్తున్నారు. దీంతో పాటు పలమనేరు మండలంలోని ముసలిమడుగు వద్ద రూ.16 కోట్లతో కౌండిన్యలో 22 ఎకరాల్లో ఎలిఫెంట్ హబ్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ పనులు జరిగాకైనా ఇక్కడ ఏనుగుల సమస్య తీరుతుందేమోనని ఇక్కడి ప్రజలు ఎదురుచూస్తున్నారు.

ప్రాణాలకు రక్షణ కరువైంది..



ఏనుగులతో మా ప్రాణాలకు రక్షణ కరువైంది. ఏ క్షణంలో ఏనుగులు వస్తాయో తెలియదు. మా ఇంటిపైకి రెండు సార్లు పడి ఇంటిని ధ్వంసం చేశాయి. ప్రాణాలతో ఎలాగో బయటపడ్డాం. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నా ఫలితంలేదు. ఎలాబతికేదో అర్థం కావడంలేదు. దీనిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

–భాస్కర్‌నాయుడు, రైతు, బయ్యప్పగారిపల్లి

కుంకీలు వస్తే సమస్య తీరుతుందేమో...



ఏనుగుల కారణంగా రైతులు పండించిన పంటలను నష్టంతో పాటు రైతుల ప్రాణాలు పోతున్నాయి. అడవిలోంచి ఏనుగులు బయటకు రాకుండా గత ప్రభుత్వాలు చేపట్టిన చర్యలు ఫలితం లేకుండాపోయాయి. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే కుంకీ ఏనుగులను తెప్పించి ఇక్కడి ఏనుగులను అదుపులోకి తీసుకొచ్చి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ఈ పనులు వేగంగా సాగితే బాగుంటుంది.

–ఉమాపతి, రైతు, ముసలిమడుగు

వంద రోజులు పనులు కల్పించండి

• పీడీ రవికుమార్


మాట్లాడుతున్న పీడీ రవికుమార్

చౌడేపల్లె: వలసల నివారణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి పథకంలో ప్రతి కుటుంబానికి వంద రోజులు పనులు కల్పించాలని డ్వామా పీడీ రవికుమార్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 17వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభకు ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 2023–2024 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ, పంచాయతీ రాజ్, ఎస్‌ఎస్‌ఏ, వివిధ శాఖల అనుసంధానం ద్వారా 1,707పనులకుగాను రూ.7.08 కోట్ల నిధులు వేతనాలుగా, మెటీరియల్ రూపంలో చెల్లించామన్నారు. సామాజిక తనిఖీ బృందం 15 రోజులపాటు పనులను రికార్డుల ఆధారంగా తనిఖీ చేసి గుర్తించిన అంశాలను వెల్లడించారు. పండ్లతోటల పెంపకం, భూగర్భజలాలను పెంచే పనులపై దృష్టిపెట్టాలన్నారు. తనిఖీల్లో రూ.28వేల రికవరీకి ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహించిన సిబ్బందికి జరిమానా విధించారు. డీవీఓ ఉమావాణి, ఏపీడీ రవికుమార్, ఏపీఓ శ్రీనివాస్‌యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ట


పూజల్లో జెడ్పీ చైర్మన్

వి.కోట: మండలంలోని తోటకనుమ పంచాయతీ మోర్నపల్లిలో శనివారం లక్షణస్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పూజల్లో పాల్గొన్నారు.


పుంగనూరులో సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి

• పరామర్శ

పుంగనూరు: పట్టణంలోని బీఎంఎస్ క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ కుమారుడు సురేష్ ఇటీవల మృతిచెందాడు. శనివారం రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అలాగే మున్సిపల్ కాంట్రాక్టర్ అజ్మతుల్లా కుమారుడు హిదయతుల్లా మృతిచెందడంతో ఆయన ఇంటికీ వెళ్లి ఎమ్మెల్యే, ఎంపీ పరామర్శించారు.

స్వచ్ఛతా హీ సేవ అమలు ఇదేనా?



సోనితా నగర్‌లో మురుగుగుంతలు, పేడదిబ్బలు

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలో గతనెలగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్టు నిత్యం పత్రికల్లో వస్తూనే ఉన్నాయి. కానీ ఇదంతా కేవలం ఫొటోలకు మాత్రమే. పట్టణంలోని పలుచోట్ల పారిశుధ్యం లోపించి రోగాలకు కారణంగా మారింది. వీటిని అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. పట్టణ సమీపంలోని బొమ్మిదొడ్డి రోడ్డులో బుద్ధిమాంద్యం పాఠశాల నుంచి సోనియానగర్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే పేడదిబ్బలు, ఇళ్లలోంచి వచ్చే మురుగునీరు రోడ్డుపైనే గుంతల్లో నిల్వ ఉంది. దీంతో రోగాలకు కారణమవుతోంది. దీనిపై స్థానిక మున్సిపల్ శానిటేషన్ ఇన్‌చార్జి యోగరంజినిని వివరణ కోరగా వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కానీ చర్యలు మాత్రం ఇంకా మొదలు కాకపోవడం కొసమెరుపు.


గురువులతో పూర్వ విద్యార్థులు

• అపూర్వ కలయిక

చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాలలో 2006–2007 సంవత్సరంలో పదో తరగతి వరకు చదువుకున్న పూర్వవిద్యార్థులు 17 ఏళ్ల తరువాత అదే పాఠశాలలో శనివారం కలిసేందుకు వేదికైంది. వీరందరినీ ఏకం చేయాలనే ఆలోచన మునితేజ, బాల సుబ్రమణ్యం, గిరి, పవన్, కౌండిన్య మెదిలింది. వీరి సహకారంతో శనివారం చౌడేపల్లె పాఠశాలలో పూర్వవిద్యార్థులందరూ ఒక్కటయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమతో చదువుకున్న యశ్వంత్, అబ్దుల్ సమద్, మోషే, శివ, గంగాధర్, ఉపాధ్యాయులు ఎర్రంరెడ్డి, ఖాజా మృతిచెందడంతో వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించి వారి ఆశీర్వాదాలు అందుకున్నారు. పాఠశాల అభివృద్ధితో పాటు తమతో చదువుకున్న విద్యార్థుల్లో వారు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారిని ఆదుకుంటామని తీర్మానించారు.

కోనేటిరాయస్వామి ఆలయంలో భక్తుల రద్దీ


అన్నదానం చేస్తున్న దాతలు

గంగవరం: పెరటాసి నెల మూడో శనివారం కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పలువురు అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. 9 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర తెలిపారు. దాతల సహకారంతో ఆలయంలో అన్నదానం చేశారు.

కమనీయం.. కల్యాణం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు

• గోవిందనామ స్మరణతో మారుమోగిన బేటరాయస్వామి కొండ

కుప్పంరూరల్: టీటీడీ ఆధ్వర్యంలో శనివారం కుప్పం మండలం, బేటరాయస్వామికొండ వద్ద పెరటాసి నెల 3వ శనివారం నిర్వహించిన శ్రీనివాస కల్యాణం వైభవంగా జరిగింది. గోవింద నామస్మరణంతో బేటరాయస్వామి కొండ మారుమోగింది. ఉదయం 10 గంటలకు టీటీడీ వేదపండితులు స్వామివారి ప్రతిమలతో కొండ ప్రాంతంలోని చలువ పందిళ్ల వద్దకు చేరుకున్నారు. అప్పటికే పట్టువస్త్రాలతో వేచి ఉన్న దంపతులు, భక్తుల మధ్య కల్యాణోత్సవం ప్రారంభించారు. పండితుల వేద మంత్రాలు సాగుతున్నంతసేపు కొండ ప్రాంతం భక్తి పారవశ్యంతో మునిగిపోయింది. 12 గంటలకు కల్యాణోత్సవం ముగియగానే పండితులు కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులు, భక్తులకు పసుపు, కుంకుమ, తీర్థప్రసాదాలు ఇచ్చి ఆశీర్వాదాలు అందించారు. భక్తులకు టీటీడీ లడ్డూ ప్రసాదాలు అందజేయగా, స్థానికులు భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, ఆర్డీఓ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో గోల్‌మాల్

• పాతపనులకు కొత్త మెరుగులు


బైరెడ్డిపల్లె పెద్దచెరువులో పాతగుంతకు కొత్తగా మెరుగులు చేస్తున్న దృశ్యం

బైరెడ్డిపల్లె: మండల పరిధిలో ఉపాధి హామీ పథకం కూటమి నేతలకు కాసులు కురిపిస్తోంది. మండలంలోని కొన్ని గ్రామాల్లో జేసీబీ, ట్రాక్టర్ల సాయంతో రాత్రి వేళల్లో మట్టిని తీసివేస్తున్నారు. ఉదయం నామమాత్రంగా కూలీలను పెట్టుకుని ఉపాధి పనులు జరిగినట్లు రికార్డులు నమోదు చేస్తున్నారు. యంత్రాలతో పనులు చేయడం వలన కూలీలకు పనులు లేవని వాపోతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు ఏమీ చేయలేక బిల్లులు పెడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. బైరెడ్డిపల్లె ఎంపీడీఓ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే పెద్దచెరువు ఉంది. అందులో ఉపాధి కూలీలు పనులు చేస్తున్నారు. అయితే గతంలో చేసిన పనులకు మెరుగులు దిద్ది బిల్లులు స్వాహా చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. కళ్ల ఎదుటే అవినీతి కనుపడుతున్నా కూటమి నేతలు మాత్రం ఏమీ జరగలేదని, కూటమి ప్రభుత్వంలో ఉపాది కూలీలకు మేలు జరుగుతుందని చెప్పడం విడ్డూరంగా ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు గానీ పట్టించుకోకపోవడం గమనార్హం అధికారం ఉందని బరితెగిస్తున్న కూటమి నేతలపై చర్యలు తీసుకోవాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

శక్తి స్వరూపిణీ..పాహిమాం





బోయకొండ: శాకాంబరిదేవిగా..., పుంగనూరులో..., సదుం: సరస్వతీదేవిగా..., రొంపిచెర్లలో గాయత్రీదేవిగా ముత్యాలమ్మ

రొంపిచెర్ల: రొంపిచెర్ల గ్రామ పంచాయతీలోని ముత్యాలమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గాయత్రీ దేవి అలంకరణలో శనివారం కొలువుదీరారు. సాయంత్రం అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగించారు.

మలాలమ్మ ఆలయంలో..

గంగవరం: మండలంలోని మేలుమాయి క్రాస్ వద్ద వెలసిన మలాలమ్మ ఆలయంలో శనివారం అమ్మవారు ధనలక్ష్మి అవతారంలో భక్తులను కటాక్షించారు.

బోయకొండలో..

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారు శాకాంబరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ, ఉభయదారులు హోమ పూజలు చేశారు.

కల్లూరులో..

కల్లూరు(పులిచెర్ల): స్థానిక వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయంలో త్రిపురాసుందరి అలంకారంలో దర్శనం ఇచ్చారు.



కుప్పంలో..., బోయకొండ: హోమ పూజల్లో పూర్ణాహుతి చేస్తున్న ఈఓ, ఉభయదారులు

సదుంలో..

సదుం: జాండ్రపేట రామలింగ చౌడేశ్వరీదేవి ఆలయంలో సరస్వతీ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్థానిక సదుమమ్మ ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులను కటాక్షించారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లెలో: శ్రీ సల్లాపురెమ్మ, బాట గంగమ్మ ఆలయాల్లో అమ్మవారిని గాయత్రీ దేవిగా భక్తులకు కనువిందు కల్గించారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని శ్రీభోగనంజుండేశ్వరిస్వామి ఆలయంలో పార్వతిదేవిని, విరూపాక్షి మారెమ్మను కూరగాయలతో అలంకరించారు.

కుప్పంలో..

కుప్పం: పట్టణంలోని శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ, పెద్దపల్లి గంగమ్మ వివిధ అలంకరణల్లో భక్తులను కటాక్షించారు. తిరుపతి గంగమ్మ ఆలయంలో అన్నపూర్ణదేవిగా దర్శనం ఇచ్చారు.

వి.కోటలో..

వి.కోట: శ్రీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వెలసిన శ్రీ వాసవీ మాత, దుర్గాదేవి ఆలయంలో వెలసిన దుర్గాదేవి కామాక్షిదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు.





గంగవరం: ధనలక్ష్మి అలంకరణలో..., కల్లూరు: త్రిపురసుందరిగా..., బైరెడ్డిపల్లె: గాయత్రీదేవిగా..., వి.కోట: కామాక్షిదేవిగా..